దెయ్యాల కొంప

బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

రామయ్య పంతులుకి చిన్నప్పుడు చదువు సమంగా అబ్బలేదు. అనేక వృత్తులుచేసి, చివరికి యుద్ధకాలంలో కంట్రాక్టు పనిచేసి బాగా డబ్బు గడించేడు. ఊరు చివర బ్రహ్మాండమైన బంగళా కట్టించేడు. బంగళా చుట్టూ విశాలమైన ఆవరణ. ఆవరణలో వెనకవేపు మామిడితోట. ముందు పువ్వులతోట. ప్రహారీగోడలు ఎత్తుగా కట్టించి, గోడలమీద గాజుపెంకులు తాపించేడు. ఇనప గజాల తలుపులు పెట్టించాడు. వీటన్నిటినీ దాటుకుని లోపలికి రావడం దెయ్యాలకు తప్ప మానవ మాత్రుడికి దుర్లభం

రామయ్య పంతులుది నల్లటి భారీశరీరం. కోరమీసాలు. ఎర్రటి కళ్ళు. చిన్నప్పుడు పెద్ద రౌడీ మరి తనంటే దెయ్యాలుకూడా హడలుకొడతాయని ఆయనే అంటూ వుండేవాడు నిజంకూడా అంతే. విద్యాగంధం లేకపోయినా స్వయంకృషివల్లనో, అదృష్టంవల్లనో లక్షరూపాయలు ఆస్తి గడించాడు. డబ్బున్నవాడికి దెయ్యాలు కూడా జడుస్తాయి.

రామయ్య పంతులుకి యిద్దరే సంతానం. ఒక కొడుకూ ఒక కూతురూను. కూతురు బంగారమ్మ బతుకు పాడైంది ఆరువేలు కట్నంపోసి చిన్నప్పుడే పెద్ద సంబంధం చూసి పెళ్ళిచేసినా రెండేళ్ళు తిరక్కుండా ఆ మొగుడు గుటుక్కుమన్నాడు. అత్తవారింటికి ఆమె వెళ్ళనేలేదు. రామయ్య పంతులు వియ్యపువారిమీద దావా తెచ్చి కూతురివంతు ఆస్తి పుచ్చుకున్నాడు. ఆమెకిప్పుడు పాతికేళ్లు దాటేయి కూతురు బతుకిలా అయిపోయిందని తల్లి నెత్తీ నోరూ కొట్టుకుని ఏడుస్తుంది. అంతకంటె యింకేం చెయ్యగ్గలదు?

బంగారమ్మకీమధ్య దెయ్యంపడుతూంది. భర్తే దెయ్యమైవచ్చి ఆమెను పట్టుకున్నాడు. అదిమొదలు ఇంట్లో అన్నీ చికాకులే.

బంగారమ్మకు కీ మధ్య మళ్ళీ పెళ్ళి చెయ్యడంమంచిదని డాక్టరు మెల్లిగా సలహా యిచ్చాడు. కాని ఎలాగ? ఆమె విధవ. పిచ్చిదికూడాను. పెళ్ళిచేస్తేనే కాని పిచ్చి కుదరదు, పిచ్చి కుదిరితేనే కాని పెళ్ళి కాదు.

ఇది దెయ్యంకాదని డాక్టరంటారు. దెయ్యమని భూతవైద్యుడంటాడు దెయ్యమయితే యీ ఎత్తైన ప్రహారీ గోడలు, ఇనపగజాల గేటు దాటి లోపలికెలా జొరబడింది?

రామయ్య పంతులుగారి ఏకైక పుత్రుడు నారాయణ అయిదోక్లాసుతో చదువుకు తిలోదకాలిచ్చాడు. చిన్నప్పటినుండీ రణపెంకిఇంట్లో డబ్బులు కొట్టేసి నాలుగేసి రోజులు యింటికే వచ్చేవాడు కాడు. పెద్దయాక కూడా అంతే. వాడికి ఊళ్లో చాలమంది స్నేహితులుండేవారు అయితే వాళ్లంతా ఏదో వొక వృత్తి చేసుకుని బతికేవారు వాళ్ళలో కొందరు జట్కావాళ్ళు, కొందరు బస్సుడ్రైవర్లు, కొందరు కిళ్లీకొట్లవాళ్ళు,కొందరు వంటబ్రాహ్మలు, ఇలాగే. నారాయణ వారి సహవాసంవల్ల అన్ని వృత్తులూ నేర్చుకున్నాడు. కాని ఇంట్లో యింత వున్నవాడు కాబట్టి ఏ వృత్తీ పట్టుకుని కూర్చోలేదు.

అయితే యీ వృత్తులు నేర్చుకోవడం అతడికెంతో లాభించింది తండ్రి వాడికి ఒక చిల్లిగవ్వకూడా యిచ్చేవాడుకాదు. కొడుకు తన కంటబడితే తిట్టేవాడు తల్లి నడిగితే యిస్తుంది కాని ఆవిడదగ్గర ఎక్కువ వుండేదికాదు పావలా అర్ధా యిస్తే బీడీ ముక్కలకే చాలదు. కర్చుచూస్తే చాలా ఎక్కువ. సాయిబుల హోటల్లో కోడిగుడ్డు అట్లు, మాంసంగారెలు అంటే వాడికి మహాయిష్టం. పేకాట ఘట్టిగా ఆడేవాడు. ఇటువంటి నిత్యకర్చులకి కొంత డబ్బు అవసరంగదా! అందువల్ల వీలు చిక్కినప్పుడల్లా యింట్లో పదీ పాతికా కొట్టేసి రైలెక్కిపోయేవాడు. ఏదో వొక వూరువెళ్లి చేతిలో వున్నది కాస్తా కర్చుపెట్టేవాడు. ఆ వూళ్లో కొత్త స్నేహితులు తటస్థించేవారు. వారిని విడిచిపెట్టలేక అక్కడ బస్సు క్లీనరుగానో, వంటబ్రాహ్మడిగానో చేరేవాడు. కొన్నాళ్లకి అది విసుగుపుట్టి, స్వస్థలంలోని పాత స్నేహితులు జ్ఞప్తికి రాగా, మళ్ళీ రైలెక్కి తిన్నగా యింటికి వచ్చేశాడు.

"ఏటి పంతులూ, ఏటి ఇసేసాలు? కేంపెల్లి వొచ్చినట్టున్నావే" అని ప్రియ మిత్రులు పలకరించినప్పుడు నారాయణకెంతో గర్వంగా వుండేది. "ఖరగ్‌పూర్ వెళ్ళి నిన్ననే వొచ్చానోయ్" అని అక్కడి వింతలు కొన్ని తెలియజేసేవాడు. అతని అదృష్టానికి స్నేహితులు యీర్ష్య పడేవారు.

కాని నారాయణకు మాత్రం ప్రస్తుత జీవితంమీద అసంతృప్తి జనించింది. మార్పులేని జీవితం అతనికి రుచించదు. అందుకే అతడు ఏ వృత్తినీ అంటిపెట్టుకుని వుండలేదు కారు డ్రైవరు, వంటబ్రాహ్మడు, కాఫీ హోటేలు సర్వర్ ఎంత మార్చినా యీ వృత్తులే. దిక్కులేని బ్రాహ్మడెవడైనా చనిపోతే అప్పుడప్పుడు అతనిని వాహకుడిగా పిలుస్తారుకూడా. ఆ పని తమాషాగానే వుంటుంది ముందర అగ్నిహోత్రం వెళుతూంటే, వెనకాతల చచ్చిన వాడి బంధువులు ఏడుస్తూంటే, బియ్యపుగింజలు, కాసులు విసిరినప్పుడు పిల్లలు వాటిని ఏరుకోడానికి కుమ్ములాడుకుంటూంటే ఆ ప్రొసెషన్‌లో "నారాయణ, నారాయణ" అంటూ శవాన్ని మోసుకెళ్లడం తమాషాగా వుంటుంది నారాయణకి కాని దానికి రోజూ ఎవరు పిలుస్తారు.

ఎప్పుడో ఎవడో ఒకసారి చస్తాడు. ఆ పనికి గిరాకీ లేదు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే నారాయణకి ఆ వూళ్లో జీవితంమీద విసుగు పుట్టింది. ఎప్పుడూ ఆ వృత్తులే ఆ స్నేహితులే. పేకాట, కసరత్తు, కుస్తీ, భజనలు ఎప్పుడూ అదే జీవితం. మార్పు వుండాలి. సినీమాల్లో జీవితం మంచి హుషారుగా వుంటుందని చాలమంది అంటారు నిజమే. సినీమా జీవితం ఎంత మజా! ఎంత తమాషా! అందులో నటులు, నటీమణులు, రాత్రిళ్లు షూటింగులు! అవుట్‌డోర్ షూటింగులు! మద్రాసు వెళ్ళి సినీమాల్లో చేరాలనే కోరిక నారాయణ మనసులో దృఢంగా నాటుకుంది. అయితే మద్రాసు వెళ్లడానికి

కొంత డబ్బు అవసరం! ఎలాగ? ఎవరిస్తారు?

రామయ్య పంతులుకి నారాయణమీద ఎలాంటి ఆశా లేదు వాడి గురించి ఎలాంటి చింతా లేదు. అయితే కూతురు బంగారమ్మ గురించి అతని మనసు బాధపడుతూంది. పాపం! బంగారమ్మ అమాయకురాలు! దానికి సుఖం లేదు! ముందు పిచ్చి కుదిరితే ఏదేనా సంబంధం చూసి మళ్ళీ పెళ్ళి చెయ్యవచ్చును భూతవైద్యుణ్ణి పిలిచి తావీజు కట్టించేడు డాక్టరు మందులూ ఇస్తున్నాడు కాని గుణం కనిపించడం లేదు పట్టిన దెయ్యం వదలకుండా వుంది రోజు రోజుకీ దెయ్యం ఇంట్లో మహా అల్లరి పెడుతూంది. చింతచెట్టుమీదనుంచి నిప్పులు రాల్చడం, బట్టలు కాలిపోవడం, సామాన్లు చిందరవందర చెయ్యడం, ఇలాగే. రామయ్య పంతులూ, భార్యా బెంగపెట్టుకున్నారు

ఒకనాటి రాత్రి ఇంటిమీద నాలుగు రాళ్లు పడాయి దొంగలేమో అని వీధిలోకి వచ్చి చూశారు రామయ్యగారు. వీధిలో చల్లదనానికి వేసిన తాటాకుపందిరిమీద మరో నాలుగు రాళ్లు పడ్డాయి ఎవరో పెంకివెధవలై వుంటారని రామయ్యగారు యింట్లోకొచ్చి పడుకున్నారు. ఆరాత్రి మరి రాళ్ళు పడలేదు.

మర్నాడు రాత్రి పన్నెండు గంటలకి పడ్డాయి. ఈసారి వర్షం కురిసినట్టే పడ్డాయి. రామయ్య పంతులుకి భయం వేసింది "నారాయణా, ఒరే నారాయణా" అని కొడుకుని పిలిచేడు, నారాయణ పెద్ద చేపాటి కర్ర పట్టుకుని వీధి గుమ్మంలో నిలబడ్డాడు.

"మనుషులైతే యివాళ వాళ్లి నెత్తురు కళ్ళజూస్తాను కలేజావుంటే ఎదురుగుండా రండి ఎవరో" అని కేకలేసుకుంటూ నారాయణ యింటిచుట్టూ తిరిగేడు ఇరుగు పొరుగువాళు లేచివచ్చారు అందరూ ఆ చుట్టుపట్ల తిరిగి చూశారు ఎక్కడా మనుషులు కనబడలేదు. కాని మళ్ళీ నాలుగైగు రాళ్ళుమాత్రం పడ్డాయి.

అంతే, ఆ రాత్రికి ఎవరి మానాన్న వారు పోయి పడుకున్నారు.

మర్నాడు ఎందుకైనా మంచిదని రామయ్యపంతులు పోలీసులను తెప్పించి యింటిచుట్టూ కాపలా పెటించాడు పందిట్లో గ్యాసు లైట్లు పెటించాడు. పోలీసు సబ్ఇన్స్పెక్టరూ, కొంతమంది జవాన్లూ పందిరిమధ్య నిలబడ్డారు ఊరిలో జనం వచ్చారు రాత్రి ఒంటిగంటైంది రాళ్లు పడ్డాయి. పందిరిమీదే పడ్డాయి. పెరటివేపునుంచి పడాయని అటు వెళ్ళి చూస్తే వీధివేపునుంచి వచ్చిపడ్డాయి పోలీసులు ఎంత గాలించినా ఎవరూ కనపడరు

"మీకెవరిమీదైనా అనుమానముందా?" అన్నారు ఇన్స్పెక్టరు గారు.

"అబ్బే, ఏమీ లేదు"

"ఇది చాలా విచిత్రంగా వుంది. ఎవడేనా మనిషి కనబడితే పట్టుకోగలం కాని." అనబోయారు ఇన్స్పెక్టర్ గారు.

"మనిషి కనబడితే మీరే పట్టుకోవాలేమిటి? కనబడితే యీపాటికి వాళ్ళ నెత్తురు కళ్ళగార్దును," అని గర్జించేడు నారాయణ చేతిలోని బాణాకర్ర గిర్రున తిప్పుతూ

"తగ్గవోయ్ పంతులూ.." అన్నారు ఇన్స్పెక్టర్ గారు నవ్వుతూ. ఆ రాత్రికి మరి పడలేదు. ఇది దెయ్యమే అయివుంటుందని రామయ్యపంతులుగార్కీ, అందరికీ నమ్మకం కలిగింది తిరుపతివెళ్ళి ఏడుకొండలవాడికి బంగారుకిరీటం చేయిస్తానని మొక్కుకుంది రామయ్యపంతులు భార్య

మన్నాడు రామయ్యగారు భూతవైద్యుణ్ణి పిలిపించేరు. ఇవాళ పందిరి పట్టపగలులా వుంది. పందిరినిండా లైట్లు పెట్టేరు. ఇంటినిండా జనం పందిట్లో జనం పందిరిమధ్య గిరిగీసి అగ్నిహోత్రం పెట్టి మంత్రాలు చదవడం ప్రారంభించేడు భూతవైద్యుడు ఒక కోడిపిల్లని బలి యిచ్చేడు కొబ్బరికాయలు కొట్టేడు భూతవైద్యుడు నాలుగు ఖాళీసీసాలు పక్కన పెట్టుకున్నాడు దెయ్యాన్ని అందులో దింపడానికి

మళ్ళీ పోలీసు ఇన్స్పెక్టరు గారు జవాన్లు పందిట్లో లాటీలు పట్టుకుని నిలబడ్డారు. నారాయణ బాణాకర్ర పట్టుకుని గస్తీ తిరుగుతున్నాడు

రాత్రి ఒంటిగంటైంది డభేలుమని ఒక రాయి పందిరిమీదనుండి అగ్నిగుండంలో పడింది. మరొకటి ఇన్స్పెక్టరుగారి కాని దగ్గర పడింది పందిరిమీద దడదడమళ్లీ నాలుగు రాళ్లు పడ్డాయి అంతా మామూలే

రామయ్యపంతులుగారి భార్య పెరట్లోకి వెళ్ళింది. అంతా కారుచీకటిగా వుంది. మొహం కడుక్కుంటే నిద్రమత్తు వదులుతుందని ఆవిడ నూతిదగ్గర కెళ్ళి బాల్టీ తీసింది నూతిగట్టు వొద్దునే కూర్చున్న ఒక మనిషి గాభరాగా లేచి నిలబడ్డాడు. ఆవిడ "అమ్మో" అని కేక వేసింది. ఆ మనిషి ఆవిడ నోరు మూశాడు. ఆవిడ తేరుకుని, ఆ మనిషి చెయ్యి పట్టుకుంది. అతని చేతిలోని రాయి క్రిందపడింది.

"ఓరి వెధవా, నువ్వట్రా, ఎంత దుర్మార్గుడివిరా" అంది ఆవిడ. నారాయణ తల్లి చెయ్యి విదిలించుకుని యింట్లోకి వెళిపోయాడు. ఆవిడకి ఏం చెయ్యాలో తోచలేదు భర్తతో ఏమని చెప్పాలో, యీ వచ్చిన జనాన్ని ఎలా సర్ది చెప్పి పంపించాలో, రేపటినుండి తను నలుగురిలో మొహం మెత్తుకుని ఎలా తిరగాలో ఆవిడకి బోధపడలేదు.

రామయ్య పంతులూ, తదితర జనమంతా వీధి పందిట్లో వున్నారు నారాయణ సరాసరి యింట్లోకి వెళ్ళి తండ్రి కోటుజేబులోని తాళాలు తీసి, కేషుపెట్టి తలుపు తెరచి మీదనే వున్న నోట్లకట్ట పట్టుకుని రైలుస్టేషన్‌కు జారిపోయాడు.

* * *

"దెయ్యం, దెయ్యమని వెయ్యి రూపాయిలు గంగలో పోశాం." అంది రామయ్య పంతులు భార్య

"అవును. మన పిల్లలికి దెయ్యం పట్టింది మరి. ఈ దెయ్యాలను కూడా నేనే సృష్టించాను" అన్నారు రామయ్య పంతులుగారు ★



రవి వెజిటబుల్ హేరాయిల్ శిరోజములను పెంపొందించి, దుమ్మెద వలువుగ నుంచి, కేశ సౌందర్యము నకు తోడ్పడును

రవి గ్లిసరిన్ సోపు, అన్ని కాలములలో వాడదగినది. శరీరమును మృదువుగను కాంతిగను ఉంచును

సోల్ ఏజంట్లు ది న్యూ స్టార్ & కో.,

తండియార్పేట, 10, వైద్యనాద మొదలి వీధి, మద్రాసు–21.